

మురుగు కాలువ పక్కనే తాగునీటి బోరు



కాలనీలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో రవి, అధికారులు

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి: సీఎం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : అతిసారం బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, దాచేపల్లిలో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ అరుణ్‌బాబును ఆదేశించారు. దాచేపల్లిలో అతిసారంతో ఇద్దరు మృతి చెందినట్లు తెలుసుకున్న సీఎం.. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దాచేపల్లిలో ప్రభుత్వపరంగా చేపట్టిన చర్యలను కలెక్టర్ వివరించారు.

ప్రాణం తోడేసిన నీళ్లు

దాచేపల్లిలో డయేరియా ప్రబలి ఇద్దరు మృతి

ఈనాడు డిజిటల్-నరసరావుపేట, న్యూస్‌టుడే-దాచేపల్లి

❖ మురుగుకాల్వ పక్కనే బోరు.. పైపులకు లీకేజీలే కారణం

❖ అంజనాపురం కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే, కలెక్టర్, డీఎంహెచ్‌వో

డయేరియా లక్షణాలతో దాచేపల్లిలో ఇద్దరు మృతి చెందడంతో జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగింది. ఒకవైపు పారిశుద్ధ్య పనులు చేపడుతూనే.. మరోవైపు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులను గుర్తించి చికిత్స అందించే పనిలో పడింది. పాత కాలం నాటి పైపులు.. మురుగుకాల్వ పక్కనే బోరు ఉండటంతో దాచేపల్లి అంజనాపురం కాలనీలో డయేరియా ప్రబలడానికి కారణంగా తెలుస్తోంది. బోరు నుంచి ఇళ్లకు సరఫరా అయ్యే పైపులన్నీ ఎప్పటివో కావడం.. వాటికి చాలా చోట్ల లీకేజీలు ఉండడంతో మురుగు చేరి కలుషితమై ఉండొచ్చని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. బోరునీటిని పరీక్షలకు పంపించారు. కలెక్టర్ తన షెడ్యూల్‌లో కార్యక్రమాలను రద్దు చేసుకుని దాచేపల్లిలోనే ఉండి కాలనీలో పర్యటించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కాలనీలో పర్యటించి డయేరియా ప్రబలడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.

కాలనీ అంతా మురుగే మురుగు

అంజనాపురం కాలనీలో సుమారు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీ మొత్తానికి ఉన్న ఒక బోరు కూడా మురుగు కాలువ పక్కనే ఉండడం విశేషం. వర్షాకాలం వచ్చిందంటే మురుగు మొత్తం ఈ బోరులోకి చేరి నీళ్లు కలుషితమవుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరుతో మరమ్మతులకు గురైన పైపులతో ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని సరఫరా చేస్తున్నారు. పైపులన్నీ మురుగుకాల్వ పక్క నుంచే వెళ్తున్నాయి. ఈ పైపులు ఏర్పాటు చేసి సంవత్సరాలు కావడంతో లీకేజీలు ఏర్పడి నీరు కలుషితమవుతోంది. మురుగు కాలువల్లో పూడిక తీయక నెలలు గడుస్తున్నా ఈ కాలనీ వైపు చూసే నాథుడే కరువయ్యాడు. కొన్ని వీధుల్లో మురుగు కాలువలు లేక ఇళ్ల ముందే గుంతలు తీసి మురుగు ఎత్తి పోసుకుంటున్నారు. సీసీ రోడ్లు లేక వర్షం వచ్చిందంటే మురుగు రోడ్లపైనే నిల్వ ఉంటోంది. వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతిచెందాక.. అధికార యంత్రాంగం హుటాహుటీన ఈ ప్రాంతానికి చేరుకొని మురుగు కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టారు.



కాలనీలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

అప్రమత్తమైన యంత్రాంగం

కాలనీలో అతిసార వ్యాపించగా.. వెంటనే జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై చర్యలు చేపట్టింది. గురువారం ఉదయమే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ పి.అరుణ్‌బాబు దాచేపల్లిలో పర్యటించారు. వైద్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. కాలనీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఇంకా ఎవరైనా అనారోగ్యానికి గురయ్యారా? వైద్య శిబిరాలు, మందుల అందజేత వంటి వాటిని దగ్గరుండి పర్యవేక్షించారు. డయేరియా ఎలా వ్యాప్తి చెందిందనే అంశంపై ప్రభుత్వ వైద్యాధికారులను, స్థానిక పురపాలక అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాలనీలో అతిసార అదుపులోకి వచ్చేంత వరకు కాచి చల్లార్చిన నీళ్లే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పురపాలక పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు డయేరియా ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు కొనసాగించాలని ఆదేశించారు.

కలెక్టర్‌తో మాట్లాడిన ఇన్‌ఛార్జి మంత్రి


దాచేపల్లిలో వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతి చెందారనే విషయం తెలుసుకున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో ఫోన్‌లో మాట్లాడి వైద్య శిబిరాల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డయేరియా లక్షణాలున్న ప్రాంతాల్లో తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. వైద్య శిబిరాల సంఖ్య పెంచాలని ఆదేశించారు. సంబంధిత ప్రాంతాల్లో బ్లీచింగ్, క్లోరినేషన్ ముమ్మరం చేయాలన్నారు. అతిసార నుంచి బయటపడటానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఊరూరా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు.

➻ చిలకలూరిపేటకు చెందిన రమ్య తాడేపల్లికి సమీపంలోని ఓ ప్రైవేటు నర్సరీలో ఎంసీఏ చేశారు. హైదరాబాద్ వెళ్లి ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుందామంటే చేతిలో ధ్రువపత్రాల్లేవు. కారణం బోధన రుసుములు జమ కాకపోవడమే.

➻ గుంటూరుకు చెందిన శ్రీలక్ష్మి చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసింది. ఈమెకు మంగళగిరి టెక్‌పార్కులో ఉద్యోగం వచ్చింది. మార్కుల ధ్రువపత్రాలతో హాజరుకావాలని వచ్చిన కాల్ లెటర్‌తో కళాశాలకు వెళ్లి అడగ్గా ఇంకా రూ. 35 వేల బకాయిలు చెల్లిస్తేనే అవి ఇస్తామంటూ బదులొచ్చింది.

పైకమిస్తేనే పత్రాలు

ఈనాడు - అమరావతి



❖ నాడు బోధన రుసుములు చెల్లించని జగన్ సర్కారు

❖ ధ్రువపత్రాలు లేక అవకాశాలు కోల్పోతున్న విద్యార్థులు

❖ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా ససేమిరా అంటున్న కళాశాలల యాజమాన్యాలు

మీ పిల్లలు పెద్ద చదువులు చదవాలి.. ఇంజినీర్లు, డాక్టర్లు కావాలి.. ఆ చదువులకు బాధ్యత నాది.. అందుకవసరమయ్యే ఫీజులు మీ అన్న చెల్లిస్తారంటూ గత ఎన్నికల ముందు వరకు బాకా ఊదిన జగన్‌మోహన్ రెడ్డి చివరకు విద్యార్థులను నిలువునా ముంచేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో బోధన రుసుములు, విద్యా దీవెన జమ చేయని కారణంగా వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల చేతికి ధ్రువపత్రాలు అందని పరిస్థితి. పిల్లల ఫీజులు చెల్లించకుండా ఆ మొత్తాన్ని నాటి జగన్ సర్కారు దారి మళ్లించడం వల్లనే గత విద్యా సంవత్సరంలో మూడు ఇన్‌స్టాల్‌మెంట్లు విడుదల కాలేదని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. ❖ 2023-24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్ తదితర వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు 20 వేలకుపైగానే ఉంటారని విద్యాశాఖవర్గాల సమాచారం. వీరిలో మూడొంతుల మంది బోధన రుసుములు, విద్యా దీవెన ఫీజులపై ఆధారపడి చదివినవారే. ప్రస్తుతం అప్పోసప్పో చేసి కళాశాలలకు బకాయిలు చెల్లించి ధ్రువపత్రాలు తీసుకెళ్లాల్సి వస్తోంది.

❖ గత వైకాపా ప్రభుత్వ నిర్వాకం వల్ల విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేకపోతున్న విషయం తెలిసి తెదేపా కూటమి ప్రభుత్వం.. వారిని ఇబ్బంది పెట్టొద్దని, బకాయిలను విడుదల చేస్తామని, సంబంధిత పత్రాలు ఇచ్చేయ్యాలని ఆదేశించినా కళాశాలల యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయి.

విద్యార్థులే చెల్లించాలని మెలిక

బోధన రుసుములు చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను బలవంతపెడుతున్నాయి. 2024 ఏప్రిల్‌తో ముగిసిన విద్యా సంవత్సరానికి మిగిలిన మూడు వాయిదాలను చెల్లించాల్సిందేనని పట్టుబడుతున్నాయి. పైగా ఈ విషయాన్ని బహిరంగంగానే అంగీకరిస్తున్నాయి. విద్యార్థుల చేతికి పత్రాలిస్తే వారి తల్లుల ఖాతాలకు జమైన రుసుమును కళాశాలలకు చెల్లించరని అందుకే బకాయిలు ముందే కట్టాలని చెబుతున్నామని ఇంజినీరింగ్ కళాశాలల అసోసియేషన్ నాయకుడొకరు తెలిపారు.

రూ.25 లక్షలతో రాపిడ్ ఫిల్టర్లు ఏర్పాటు: యరపతినేని

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి పరిధిలోని అంజనీపురం కాలనీలో రూ.25 లక్షలతో రాపిడ్ ఫిల్టర్లను ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. కాలనీలో అతిసారం బాధితులు, మృతుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఆయన కలెక్టరు అరుణ్‌బాబుతో కలిసి కాలనీలో పర్యటించారు. మురుగు కాలువ పక్కనే ఉన్న బోరును పరిశీలించారు. తాగునీరు కలుషితంతో అతిసారం ప్రబలి ఉంటుందని వైద్యాధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ బోరు నుంచి వచ్చే నీటికి ర్యాపిడ్ ఫిల్టర్‌లను ఏర్పాటు చేసి శుద్ధి చేసిన తర్వాత సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి రూ.25 లక్షల వరకు వెచ్చిస్తామన్నారు. కాలనీల్లో పారిశుద్ధ్యం మెరుగు పరుస్తామన్నారు. మురుగు కాలువలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని ఆయన పేర్కొన్నారు. కలెక్టరు మాట్లాడుతూ కాలనీలో సరఫరా అయ్యే తాగునీటిని పరీక్షల నిమిత్తం విజయవాడ పంపించామన్నారు. ఆర్వో ప్లాంటు నీటిని కూడా పరీక్ష చేయిస్తామని తెలిపారు. ఆర్డీవో మురళీకృష్ణ, డీఎంహెచ్‌వో రవికుమార్, తహసీల్దార్ కుటుంబరావు, ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు జారీ

అంజనీపురం కాలనీలో అతిసారం ప్రబలినా స్థానిక వైద్యులు, సిబ్బంది జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వకపోవడాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ముందుగానే గుర్తించి సరైన వైద్యం అందిస్తే మరణాలు సంభవించేవి కావన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ కారణంతోనే వైద్యాధికారికి షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిసింది.



బాధితురాలితో మాట్లాడుతున్న కమిషనర్ సిరి

అతిసార బాధితులకు పరామర్శ

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి అంజనీపురం కాలనీకి చెందిన అతిసారం బాధితులను రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సిరి పరామర్శించారు. అత్యవసర చికిత్స నిమిత్తం 108 వాహనాలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. బాధితులకు అందుతున్న వైద్యంపై డీఎంహెచ్‌వో రవి, మండల వైద్యాధికారి అమూల్యతో మాట్లాడారు.

నేడు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి రాక

దాచేపల్లికి శుక్రవారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వస్తున్నట్లు జిల్లా వైద్యాధికారులు తెలిపారు. అతిసారం బాధితులను ఆయన పరామర్శించనున్నారు.

ఎన్నికల పందేల్లో నష్టపోయి.. చోరీకెళ్లి ఇరుక్కుపోయి..

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: గత సార్వత్రిక ఎన్నికల పందేల్లో రూ.లక్షలు పోగొట్టుకున్నాడు. అప్పులు తీర్చేందుకు చోరీకి పథకం పన్ని తెలిసిన వారిని ఉసిగొల్పాడు.. ఒంటరి వృద్ధ దంపతుల్ని లక్ష్యంగా చేసుకుని చేసిన చోరీ యత్నం విఫలమై.. వారంతా జైలు ఊచలు లెక్కబెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చోరీ కేసు వివరాలను డీఎస్పీ హనుమంతరావు వెల్లడించారు. స్థానిక ఒకటోవార్డు రంగాకాలనీకి చెందిన సత్తి గవన్ కుమార్‌రెడ్డి పట్టణం, పరిసర గ్రామాల్లో ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తన వద్ద ఉన్న రూ.20 లక్షల నగదుతోపాటు అప్పుగా తెచ్చిన మరో రూ.20 లక్షలు పందేలుగా పెట్టి మొత్తం పోగొట్టుకున్నాడు. దీంతో అప్పులు ఇచ్చినవారు అతడి ఇంటికి వస్తుండటంతో తప్పించుకుని తిరుగుతున్నాడు. చేసిన అప్పు తీర్చేందుకు చోరీలు చేయాలనే ఆలోచన చేశాడు. తన వద్దకు డబ్బుల కోసం వచ్చే పట్టణంలో నివాసముండే మర్రి అమ్మయ్య, రాజుపాలెం మండలం గణపవరానికి చెందిన ఎర్రసాని నానిలకు అదే విషయం చెప్పాడు. వారు కూడా సరే అనడంతో గత పది రోజులుగా పట్టణంలో రెక్కీ నిర్వహించారు. ఈక్రమంలో రైల్వేస్టేషన్ రోడ్డులో నివాసముంటున్న సీతారామయ్య కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. ఆ ఇంట్లోని పైపోర్షన్ అద్దెకు కావాలంటూ ఈనెల 22వ తేదీన వెళ్లి సీతారామయ్యపై ముగ్గురు దాడి చేశారు. నగదు ఇవ్వాలంటూ బెదిరించారు. ఆయన ధైర్యంతో ప్రతిఘటించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు రావడం చూసి ముగ్గురు పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. నిందితులు గవన్ కుమార్‌రెడ్డి, అమ్మయ్యను అరెస్టు చేశారు. వారి నుంచి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు నాని పరారీలో ఉన్నాడు. దొంగల్ని ప్రతిఘటించిన వృద్ధుడు సీతారామయ్యను డీఎస్పీ మెచ్చుకున్నారు. ఒంటరిగా ఉండే వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సీఐ బ్రహ్మయ్య, ఎస్సై సంధ్యారాణి పాల్గొన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు



సాగర్‌కు పోటెత్తిన వరద

ఎగువ కృష్ణా పరివాహక ప్రాంతంలో వరద పెరగడంతో దిగువ జలాశయాలకు నీటి చేరిక పెరిగింది. గురువారం నాగార్జునసాగర్ 20 క్రస్టుగేట్లు అయిదు అడుగులు ఎత్తి 1,62,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 2,10,446 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో కుడి కాలువకు 10,200, ఎడమ కాలువకు 6173, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2400, లోలెవల్ కెనాల్‌కు 400, సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 29,273 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం నీటిమట్టం 590.00 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరింది.

- విజయపురిసౌత్, న్యూస్‌టుడే

మంత్రి నారాయణ ఆరా

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లిలో అతిసారంపై పురపాలక శాఖ మంత్రి పొంగులేటి నారాయణ జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆరా తీశారు. గతంలో పిడుగురాళ్లలో అతిసారం ప్రబలినప్పుడు తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా అధికారులకు గుర్తు చేస్తూ.. పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగు పరచాలని సూచించారు.

నవోదయలో 9, 11వ తరగతి

ఖాళీల భర్తీకి ఫిబ్రవరి 8న ప్రవేశపరీక్ష

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : చిలకలూరిపేట మండలం మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయలో 2025- 26 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల కోసం 2025 ఫిబ్రవరి 8న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2024- 25 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతూ 01-05-2010 నుంచి 31-07-2012 మధ్య జన్మించి ఉన్న విద్యార్థులు 9వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వీరికి హిందీ, ఆంగ్లం, గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో ఆబ్జెక్టు విధానంలో ప్రశ్నపత్రం ఆంగ్ల, హిందీ భాషల్లో ఉంటుందన్నారు. ❖ 2024- 25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతూ 01-06-2008 నుంచి 31-07-2010 మధ్య జన్మించిన విద్యార్థులు 11వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వీరికి పరీక్ష ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్ సైన్స్, మెంటల్ ఎబిలిటీ సబ్జెక్టుల్లో ఓ.ఎం.ఆర్. పద్ధతిలో ఆంగ్ల, హిందీ భాషల్లో ప్రశ్నపత్రం ఉంటుందన్నారు. 30 లోపు ఉమ్మడి గుంటూరు జిల్లాలో చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ జవహర్ నవోదయ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

రాజధానికి.. మరో మణిహారం!



"అమరావతి రైల్వేలైన్‌కు కేంద్రం పచ్చజెండా ఊపడంతో ఇది రాజధానికి మరో మణిహారంగా మారబోతోంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు, ప్రధానంగా విజయవాడ, గుంటూరు నగరాలకు వరంగా మారబోతోంది. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ భారీగా తగ్గించబోతోంది. విజయవాడతో సంబంధం లేకుండా 39 కిలోమీటర్ల దూరంలో మలుపు తిరిగి.. అమరావతి మీదుగా గుంటూరు, అక్కడి నుంచి ఇతర నగరాలకు తేలికగా చేరుకునేందుకు వీలు కలుగుతుంది. ఈ లైన్‌ను ఐకానిక్‌గా మార్చి పర్యాటకులను సైతం ఆకర్షించడంపైనా.. ప్రభుత్వం దృష్టి సారించింది. 57 కిలోమీటర్ల అమరావతి రైల్వే లైన్‌లో.. కృష్ణా నదిపై నిర్మించబోయే 3.2 కి.మీ. ఐకానిక్ వంతెన పర్యాటకులను ఆకర్షించబోతోంది. ఈ రైల్వేలైన్ పర్యావరణహితంగానూ ఉండబోతోంది. ఈ నూతన లైన్‌తో వాహన కాలుష్యాన్ని సైతం పెద్దఎత్తున తగ్గించబోతున్నారు."


✦ అమరావతి రైల్వేలైన్‌తో ఈ ప్రాంతానికి మహర్దశ

✦ ఉమ్మడి కృష్ణా, గుంటూరువాసులకు వరం

✦ విజయవాడకు వెలుపల ఎర్రుపాలెం నుంచి ఆరంభం

✦ గుంటూరుకు ముందు నంబూరు స్టేషన్ వద్ద కలుస్తుంది











ఈనాడు, అమరావతి

దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యంత రద్దీ స్టేషన్లలో విజయవాడ ఒకటి. నిత్యం రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం 250 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. రోజుకు సాధారణ రోజుల్లోనే లక్ష మందికి పైగా ప్రయాణికులు వచ్చి వెళుతుంటారు. సెలవులు, పండగ రోజుల్లో రెండు లక్షల మంది దాటుతుంటారు. అందుకే రైళ్ల రాకపోకల్లో జాప్యం, స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రత్యామ్నాయంగా విజయవాడకు చుట్టుపక్కల ఉన్న కృష్ణా కెనాల్(తాడేపల్లి), గుణదల, రాయనపాడు స్టేషన్లను శాటిలైట్‌గా మార్చాలనే ప్రతిపాదన చాలా కాలంగా ఉంది. తాజాగా అమరావతి లైన్‌కు కూడా ఆమోద ముద్ర పడడంతో.. గుంటూరు వైపు వెళ్లే రైళ్లు.. విజయవాడకు రావాల్సిన అవసరం ఉండదు.

అనుసంధాన "మస్తు"!

ఎర్రుపాలెం-నంబూరు మధ్యలో తొమ్మిది కొత్త స్టేషన్లు రానుండడంతో ఈ ప్రాంతాలన్నింటికీ రైలు కనెక్టివిటీ ఏర్పడుతుంది. తద్వారా వాహన కాలుష్యం విపరీతంగా తగ్గుతుంది. పరిటాల రైల్వే స్టేషన్ వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్‌ను నిర్మించనున్నారు. వీటన్నింటికి తోడు కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అసలు సంబంధమే లేకుండా ఉండేలా ఈ నూతన లైన్‌ను పర్యావరణహితంగా నిర్మించనున్నారు.

విజయవాడ బయట నుంచే వెళ్లేలా..

దిల్లీ ప్రధాన లైన్‌లో వచ్చే రైళ్లు విజయవాడతో సంబంధం లేకుండా నేరుగా అమరావతి మీదుగా గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడకు 39 కిలోమీటర్ల దూరంలో కొండపల్లి రిజర్వ్‌ఫారెస్ట్‌కు వెలుపలి నుంచి సరిగ్గా ఎర్రుపాలెం రైల్వే స్టేషన్ వద్ద నుంచి ఈ లైన్‌ను అమరావతికి అనుసంధానం చేస్తారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు స్టేషన్‌కు కలుపుతారు. నంబూరు నుంచి గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడ, గుంటూరు మధ్యలో నంబూరు ఉంటుంది. ఈ నూతన లైన్ విజయవాడకు బైపాస్ లాంటిదే. భవిష్యత్తులో ఈ లైన్ అత్యంత ప్రధానమైన మార్గంగా మారబోతోంది. అమరావతి నుంచి ఎర్రుపాలెం వైపు వస్తే దిల్లీ, హైదరాబాద్, అహ్మదాబాద్, ముంబయి వెళ్లిపోవచ్చు. నంబూరు నుంచి గుంటూరు స్టేషన్, అక్కడి నుంచి తెనాలి వస్తే ప్రధాన రైల్వే లైన్‌లో కలిసిపోతుంది. అక్కడినుంచి విశాఖ, చెన్నై, బెంగళూరు, కేరళ వరకూ వెళ్లిపోవచ్చు.

పర్యాటకాభివృద్ధికి దోహదపడేలా నిర్మాణం

అమరావతిని దేశంలో ప్రధాన నగరాలు అన్నింటితో కలిపేందుకు ఈ నూతన లైన్ దోహదపడుతుంది. ఈ నూతన లైన్‌ను అనుకున్న లక్ష్యంలోగా పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించబోయే ఈ లైన్‌లో అనేక విశేషాలుంటాయి. ఐకానిక్ వంతెన కూడా కృష్ణా నదిపై వస్తుండడంతో పర్యాటకాభివృద్ధికి సైతం దోహదపడుతుంది.

- పి.ఈ.ఎడ్విన్, ఏడీఆర్ఎం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విజయవాడ రైల్వే డివిజన్

జిల్లా పాఠశాల విద్యాధికారిణిగా చంద్రకళ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : పల్నాడు జిల్లా పాఠశాల విద్యాధికారిణిగా ఎల్.చంద్రకళను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ డీఈవోగా విధులు నిర్వహిస్తున్న ఆమెను బోయపాలెం డైట్ కళాశాలకు ప్రిన్సిపల్‌గా బదిలీ చేస్తూ జిల్లా విద్యాధికారిణిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు డీఈవోగా విధులు నిర్వహించిన ఎం.వెంకటేశ్వర్లును అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు.



పులిచింతలకు పెరిగిన వరద

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు వరద ప్రవాహం మళ్లీ పెరిగింది. గురువారం రాత్రి 7 గంటలకు 9 రేడియల్ గేట్లు ఎత్తి 2,17,755 క్యూసెక్కులు, విద్యుత్తు ఉత్పత్తికి 16,000 క్యూసెక్కులు దిగువ ప్రకాశం బ్యారేజికి విడుదల చేసినట్లు ఏఈఈ విక్రమ్ తెలిపారు. ప్రాజెక్టులో 44.64 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

టెయిల్‌పాండ్‌కూ..

రెంటచింతల: సత్రశాల టెయిల్‌పాండ్ జలాశయానికి వరద భారీగా వస్తోందని జెన్‌కో ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. సాగర్ నుంచి 1,88,220 లక్షల క్యూసెక్కులు నీరు టెయిల్‌పాండ్‌కు చేరుతోంది. దీంతో జలాశయం 12 క్రస్టు గేట్లు 3 మీటర్ల ఎత్తు ఎత్తి దిగువన పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం 75.37 మీటర్ల ఎత్తు వరకు నీరు నిల్వ ఉంచినట్లు తెలిపారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక బృందాలు : ఎస్పీ

ప్రతిభ చూపిన అధికారులకు సత్కారం



బహుమతి అందుకుంటున్న చిలకలూరిపేట గ్రామీణ సీఐ సుబ్బానాయుడు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, సారా విక్రయాలు అరికట్టేందుకు పోలీసు అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేయాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశించారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర నంబరు 112కు వచ్చే ఫోన్ కాల్స్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) సంతోష్, ఏఎస్పీ (క్రైం) లక్ష్మీపతి, నరసరావుపేట, సత్తెనపల్లి డీఎస్పీలు నాగేశ్వరరావు, హనుమంతరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.


★ కేసుల దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ చూపిన మాచర్ల పట్టణ సీఐ ప్రభాకర్, కారంపూడి సీఐ శ్రీనివాసరావు, చిలకలూరిపేట గ్రామీణ సీఐ సుబ్బానాయుడు, సత్తెనపల్లి పట్టణ సీఐ బ్రహ్మయ్య, నరసరావుపేట 2వ పట్టణ సీఐ హైమారావు, నాగార్జునసాగర్ ఎస్సై షఫి, చిలకలూరిపేట గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్‌కు ఎస్పీ, ఏఎస్పీ బహుమతులు అందజేశారు.

విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్నారు..!

● నవోదయ 11, 12 విద్యార్థులకు కేంద్ర పథకం వరం ● ఐఐటీ, నీట్ పరీక్షల్లో ప్రతిభ

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులను ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేసుకుని వారికి 6 నుంచి 12వ తరగతి వరకు శిక్షణ ఇస్తున్న జవహర్ నవోదయ విద్యాలయాలకు విజ్ఞాన జ్యోతి పథకం 11, 12 విద్యార్థులకు వరంగా మారింది. దీని ద్వారా మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 11, 12 తరగతి విద్యార్థులకు ఐఐటీ, నీట్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇందులో 12వ తరగతి విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలతో పాటు ఏడాదికి రూ.12 వేల ఉపకార వేతనం కూడా అందిస్తున్నారు. గత ఏడాది వీటిని అందిపుచ్చుకున్న విద్యార్థులు కార్తీక్, గణేష్, హృదయ్, హనుమంతు నాయక్, భరత్, వీరాంజనేయ నాయక్ ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, నీట్‌లో సీట్లు సాధించారు. తమకు విద్యాలయంలో అందించిన శిక్షణ జాతీయ స్థాయి విద్యాలయాల్లో సీటు సాధించేందుకు దోహదపడిందని అంటున్నారు. వారి మాటల్లో ...



విద్యార్థులకు ట్యాబ్‌లో పరీక్షలు

కార్పొరేట్ తరహాలో ..



తరగతిలో చెప్పే పాఠాల ప్రణాళిక ప్రకారం వారంలో రెండు రోజులు ఐఐటీ, నీట్‌లో శిక్షణ ఇస్తున్నారు. చెప్పిన పాఠాలపై ట్యాబ్‌లో ఆన్‌లైన్ విధానంలో కార్పొరేట్ తరహాలో పరీక్షలు రాస్తున్నాం. ఇది పోటీతత్వాన్ని తెలియజేస్తోంది. ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, రవి తదితరుల సహకారం మరువలేనిది. వీరి ప్రోత్సాహంతో ఐఐటీలో సీటు సాధించాను. బీటెక్ తర్వాత ఎం.ఎస్. చేసి కొత్త ఆవిష్కరణలు చేయాలన్నదే లక్ష్యం.

- కార్తీక్, ఐఐటీ (కంప్యూటర్ సైన్స్), ఖరగ్‌పూర్

ఎండీ జనరల్ మెడిసిన్ చేయాలని



ఆరో తరగతిలో నవోదయలో చేరి.. 12వ తరగతి వరకు విద్య అభ్యసించాను. 11, 12 తరగతుల్లో నీట్‌పై అందించిన శిక్షణ ఎంబీబీఎస్‌లో సీటు సాధించడానికి దోహదపడింది. ఎప్పటికప్పుడు తరగతి గదిలో చెప్పే పాఠాలతో పాటు వాటికి సంబంధించి పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. నీట్ నమూనా ప్రశ్నపత్రాలను నిరంతరం సాధన చేయించడం పోటీ పరీక్షల్లో సీటు సాధించేందుకు ఉపయోగపడింది. ఎంబీబీఎస్ తర్వాత ఎండీ జనరల్ మెడిసిన్ చేయాలన్నదే లక్ష్యం.

- నీరాంజనేయులు, ఎంబీబీఎస్, ఉస్మానియ మెడికల్ కళాశాల, హైదరాబాద్

ఆన్‌లైన్‌లో డిజిటల్ తరగతుల ద్వారా..



నవోదయలో చదువుకోవడం పేద విద్యార్థులకు వరం. ఇక్కడ పాఠాలు కార్పొరేట్ స్థాయిలో ఉంటాయి. డిజిటల్ తరగతులు, ట్యాబ్‌ల ద్వారా పోటీ పరీక్షల శిక్షణ ఇవ్వడంతో సీటు సాధించా. ప్రతి అంశాన్ని అధ్యాపకులు అర్థమయ్యే రీతిలో నేర్పారు. జాతీయ స్థాయి విద్యాలయంలో ఐఐటీ చదువుకునేందుకు అవకాశం కల్పించిన నవోదయ విద్యాలయను మరిచిపోను.

-గణేష్, ఐఐటీ (మెకానికల్), హైదరాబాద్

విలువలతో కూడిన విద్య



కార్పొరేట్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు దీటుగా మెయిన్స్ ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించా. నవోదయలో విశాలమైన తరగతి గదులు, డిజిటల్ క్లాస్ రూమ్స్, ప్రతి విద్యార్థికి ట్యాబ్‌లు ఇచ్చి శిక్షణ అందించారు. ప్రతి అంశాన్ని అధ్యాపకులు అర్థమయ్యేలా సులభరీతిలో నేర్పారు. ఉన్నత విద్యకు మంచి అవకాశం కల్పించిన నవోదయకు రుణపడి ఉంటాను.

-హనుమంత్‌నాయక్, ట్రిపుల్ ఐటీ (కంప్యూటర్ సైన్స్), కాంచీపురం

కేంద్ర ప్రభుత్వ సహకారంతో..



కేంద్ర ప్రభుత్వంలోని మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో అందించిన విజ్ఞానజ్యోతి పథకం నవోదయలో విద్యార్థులకు వరంగా మారింది. రూ.లక్షలు ఖర్చు పెట్టి కార్పొరేట్ కళాశాలల్లో చదువుకుంటేనే ఐఐటీ, నీట్ ర్యాంకులు వస్తాయని అందరూ అనుకుంటారు. జవహర్ నవోదయలో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వీటిలో ఉచిత శిక్షణ అందిస్తుండటంతో గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు జాతీయ విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం గర్వంగా ఉంది.

-నల్లూరి నరసింహారావు, ప్రిన్సిపల్, జేఎన్‌వీ, మద్దిరాల

Rc.No.1574/2024-H5 O/o The Electoral Registration Officer, Krishna - Guntur Graduates' Constituency & District Revenue Officer, Guntur.

Annexure-A1

ELECTION COMMISSION OF INDIA

Revision of Electoral Rolls for Krishna-Guntur Graduates' Constituency of Andhra Pradesh Legislative Council.

Notice under Rule 31(4) of the Registration of Electors Rules, 1960

In pursuance of Rule 31(4) of the Registration of Electors Rules, 1960, the Electoral Registration Officer, Krishna-Guntur Graduates' Constituency vide her notice dated:30.09.2024, called upon every person entitled to be registered in the electoral roll of the Krishna-Guntur Graduates' Constituency, to send to, or deliver at, his/her office on or before 06.11.2024 **(i.e. the last date of receipt of applications)** application in Form 18 appended to the Registration of Electors Rules, 1960 and reproduced in the second schedule of the said notice published in the edition dated:30.09.2024 & First re-publication notice was published on 16.10.2024 (1) in Eenadu and (2) Andhra jyothi News Papers.

All the above mentioned may submit their applications in Form 18 on or before 06.11.2024 **(i.e. the last date of receipt of applications)**, if not already done.

The said details are also available in the official website of the Chief Electoral Officer, Andhra Pradesh at www.ceoandhra.nic.in

Date: 25.10.2024 Sd/- **P. Roja**
Place: Guntur Electoral Registration Officer
Krishna-Guntur Graduates' Constituency
& District Revenue Officer, Guntur

మానసిక ఒత్తిడి లేకుండా పోలీసు విధులు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో మానసిక, శారీరక ఒత్తిళ్లకు గురై అనారోగ్యం బారిన పడకుండా పోలీసులు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని, వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించేలా చర్య తీసుకుంటున్నామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యాయామశాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) సంతోష్, ఏఎస్పీ (క్రైం) లక్ష్మీపతి, డీఎస్పీ గాంధీ, నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, జిల్లాలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రాత్రయితే తవ్వి తరలించేస్తారు


వినుకొండ రూరల్, న్యూస్‌టుడే



మట్టి తవ్విన ప్రాంతంలో ఏర్పడిన గుంత

జాలలపాలెం సమీపంలోని వినుకొండ పట్టణ గృహ నిర్మాణాలకు స్థలం కేటాయించిన జగనన్న కాలనీ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు రాత్రివేళ్లలో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొంతమంది రాత్రివేళ్లలో ఈ తతంగాన్ని కానిచ్చేస్తున్నారు. రాత్రిళ్లు ట్రాక్టర్లతో వచ్చి మట్టిని తీసుకెళ్తున్నారని.. దీంతో నిద్ర కూడా ఉండటంలేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎం సహాయనిధికి రూ.5 లక్షల విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్లు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : కృష్ణవేణి డిగ్రీ కళాశాల యాజమాన్యం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం కళాశాల యాజమాన్యం గురువారం సీఎం సహాయనిధికి విరాళం అందజేసింది. ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో కలిసి వెళ్లినట్లు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య కనుమూరి లక్ష్మీ ఉన్నారు.

డీఆర్వో వినాయకం బదిలీ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట : పల్నాడు జిల్లా డీఆర్వో కె.వినాయకం బదిలీ అయ్యారు. గురువారం ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఏపీ ఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) జనరల్ మేనేజర్‌గా ఉన్న ఏక మురళీని ప్రభుత్వం డీఆర్వోగా నియమించింది. ప్రస్తుత డీఆర్వోకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రభుత్వ పరిపాలనా విభాగంలో రిపోర్టు చేయాలని సూచించింది. డీఆర్వోగా జిల్లాలోనే కొనసాగాలనే ప్రయత్నాలు చేసినా ఫలించలేదు.

మద్యం దుకాణాల లైసెన్స్ గడువు పొడిగింపు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని 129 ప్రైవేటు మద్యం దుకాణాలకు జారీ చేసిన తాత్కాలిక లైసెన్స్ గడువును ఈ నెలఖారు నాటికి పొడగించినట్లు అబ్కారీ శాఖ జిల్లా అధికారి మణికంఠ గురువారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసుకుని, ప్రతిపాదనలు సమర్పించాక శాశ్వత లైసెన్స్ జారీ చేస్తామని, అందుకు 31 వరకు అవకాశం ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

ఇకనైనా వీటిని వినియోగించండి



నిరుపయోగంగా తాగునీటి ట్యాంక్

చిలకలూరిపేట పట్టణ తాగునీటి చెరువు వద్ద ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీటి పథకం ద్వారా గతంలో పలు గ్రామాల్లో ట్యాంకులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న ట్యాంకుల ద్వారా సురక్షిత నీటిని అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ


అప్పులు తీరే దారిలేక..
కౌలు రైతు బలవన్మరణం



శ్రీను (పాత చిత్రం)

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: అప్పులు తీర్చే దారిలేక.. కుమార్తెకు పెళ్లి చేయలేక కౌలురైతు బలవన్మరణం చెందిన ఘటన మండలంలోని మాదలలో గురువారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబం, పోలీసుల వివరాల మేరకు.. మాదల గ్రామానికి చెందిన ఉగ్గం శ్రీను (43) కౌలుకు పొలం తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. ఏటా నష్టాలతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ ఏడాది వ్యవసాయం కలిసొచ్చి నష్టాలు తీరుతాయని ఏడెకరాల్లో పత్తి, వరి సాగు చేశాడు. వర్షాలకు పత్తి పంట దెబ్బతినడంతో మనోధైర్యాన్ని కోల్పోయాడు. రూ.15 లక్షల వరకు అప్పు ఉండటంతో తీర్చే దారిలేక మనోవేదన చెందుతున్నాడు. ఒక్కగానొక్క కుమార్తె నీరజ వివాహం చేయలేకపోతున్నానని బాధపడుతున్నాడు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున పశువులకు మేత వేయడానికి కొట్టం వద్దకు వెళ్లాడు. అక్కడ్నుంచి తిరిగి రాకపోవడంతో అనుమానం కలిగి కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా పురుగు మందుతాగి విగతజీవిగా పడి ఉన్నాడు. ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. కౌలురైతు భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు.

కాటేజీ నిర్మాణానికి రూ.6.50 లక్షల వితరణ



విరాళం అందజేస్తున్న శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

కాణిపాకం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయం వద్ద కాటేజీ నిర్మాణానికి పల్నాడు జిల్లా నరసరావుపేట వాసి ఎస్.శ్రీనివాసరావు, ఉమాదేవి రూ.6.5 లక్షలు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణికి గురువారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి ఉన్నారు.

బోధన వదిలి మద్యం వ్యాపారమా?

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : నరసరావుపేట మండలం యల్లమందలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కాప్రా హరికృష్ణ పాఠశాలలో బోధన వదిలేసి మద్యం వ్యాపారం చేస్తున్నారని.. చర్యలు తీసుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లుకు గురువారం మాజీ సర్పంచి కడియాల తాండవకృష్ణ ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు కేఎస్‌పీ కాలనీ ఎంపీపీ పాఠశాలలో ఎస్జీటీ అని, బోధన చేయకుండా హాజరుపట్టీలో సంతకం చేసి వెళ్లిపోతున్నట్లు డీఈవో దృష్టికి తెచ్చారు. ఇటీవల ఆయన మద్యం దుకాణాలకు భార్య కాప్రా రాధ పేరుతో టెండర్ వేసి లాటరీలో దుకాణం పొందారని తెలిపారు. పాఠశాల వేళల్లో విద్యార్థులకు బోధించకుండా మద్యం వ్యాపారానికి పరిమితమైనట్లు తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే ఉన్నతాధికారులే తన జోలికి రారని.. జీతంలో అధిక భాగం లంచాలకే వెచ్చిస్తున్నానని, తనను ఎవరూ ఏమీ చేయలేరని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలకు న్యాయం చేయని ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్తు ఉపకేంద్రంలో మద్యం తాగిన సిబ్బందిపై చర్యలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించడంతోపాటు ఉపకేంద్రంలోనే మద్యం తాగిన నలుగురు సిబ్బందిపై గురువారం ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈనెల 22న మాచర్ల సబ్‌డివిజన్ పరిధిలోని గాదెవారిపల్లె విద్యుత్తు ఉపకేంద్రంలో లైన్‌ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఏఎల్ఎం చెన్నకేశవులు, జేఎల్ఎం పరబ్రహ్మాచారి, షిఫ్ట్ ఆపరేటర్ శ్రీనివాసులు మద్యం తాగడాన్ని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో విద్యుత్తు శాఖకు చెందిన ముగ్గురిని సస్పెండ్‌తోపాటు షిఫ్ట్ ఆపరేటరును విధుల నుంచి తొలగించినట్లు మాచర్ల విద్యుత్తు డీఈ రాబొట్లు తెలిపారు.

ఆరోగ్య కేంద్రంలో అవినీతిపై ఆరా



ఆరోగ్య కేంద్రంలో రికార్డులు సేకరిస్తున్న ఏవో సీతారామిరెడ్డి

దుర్గి, న్యూస్‌టుడే: మండల కేంద్రం దుర్గి ఆరోగ్య కేంద్రంలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో గురువారం డీఎంహెచ్‌వో రవి ఆకస్మిక తనిఖీ చేశారు. అయితే దాచేపల్లిలో అతిసారం ప్రబలిందన్న సమాచారంతో వచ్చిన పదినిమిషాల్లోనే అక్కడికి వెళ్లిపోయారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను తన కార్యాలయానికి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏవో సీతారామిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెల్లస్లీ రికార్డులు సేకరించారు. అభివృద్ధి నిధులతో కొనుగోలు చేసిన సామగ్రి బిల్లులను తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు హరిప్రసాద్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

టీం-ఎ జట్టు జయకేతనం

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో అండర్-19 రాష్ట్ర ప్రాబబుల్స్ క్రికెట్ పోటీల్లో టీం-ఎ జట్టు ఘన విజయం సాధించింది. విజయానికి 157 పరుగులు చేయాల్సి ఉండగా టీం-బి జట్టు అనూహ్యంగా 91 పరుగులకే కుప్పకూలింది. దీంతో టీం-ఎ జట్టు 79 పరుగుల తేడాతో విజయం సాధించింది. వికెట్ నష్టానికి 14 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో చివరి రోజైన గురువారం బ్యాటింగ్ చేపట్టిన టీం- బి జట్టు 49 ఓవర్లలో మరో 77 పరుగులు మాత్రమే జోడించి 91 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని వరుణ్ సాత్విక్ 32 పరుగులు చేశాడు. టీం- ఎ బౌలర్లు ఎ.నాగ కుళ్లాయప్ప 2 వికెట్లు, హమీద్ రెండు వికెట్లు పడగొట్టారు. విజయం సాధించిన టీం- ఎ జట్టు ఆరు పాయింట్లు సాధించిందని గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు తెలిపారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక నేడు

నరసరావుపేట క్రీడలు : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ అండర్- 17 విభాగంలో బాల, బాలికల ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక శుక్రవారం చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ గురువారం తెలిపారు. వివిధ క్రీడా విభాగాల్లో ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక చేసే పాఠశాలల వివరాలు ఆయన ప్రకటించారు.

★ 25న యోగా అండర్- 17 విభాగంలో బాల, బాలికల ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక రావెల జడ్పీ పాఠశాలలో, 26న యోగా అండర్- 14 విభాగంలో బాల, బాలికల జట్ల ఎంపిక పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బాల్ బాడ్మింటన్ అండర్- 14, 17 బాలుర విభాగంలో జట్ల ఎంపిక పసుమర్రు జడ్పీ పాఠశాలలో, 26న స్విమ్మింగ్ అండర్- 14, 17 విభాగంలో బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికను నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 28న అథ్లెటిక్స్ అండర్- 14 విభాగంలో బాల, బాలికల జట్ల ఎంపిక సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 28న ఖో-ఖో అండర్- 17 విభాగంలో బాల, బాలికల జట్ల ఎంపిక నకరికల్లు ఉన్నత పాఠశాలలో, 29న బాల్ బాడ్మింటన్ అండర్ -14, 17 విభాగంలో బాలికల జట్ల ఎంపికను శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉంటాయని తెలిపారు. 30న సాఫ్ట్‌బాల్ అండర్- 17 విభాగంలో బాల, బాలికల ఉమ్మడి గుంటూరు జట్ల ఎంపికను రావెల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో ।కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, రిటైల్ ధర - 150, చికెన్ విత్‌స్కిన్ - 218, చికెన్ స్కిన్‌లెస్ - 248.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, 142, 153 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

మౌలిక సదుపాయాలు కల్పించండి

✤ మంత్రి గొట్టిపాటికి సీపీఐ నాయకుల విజ్ఞప్తి

వినుకొండ, న్యూస్‌టుడే : పట్టణంలోని అజాద్‌నగర్ కాలనీ (మసీదు మాన్యం)లో తాగునీరు, విద్యుత్తు సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ కోరారు. వినుకొండ వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నివాసం వద్ద గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అక్కడ ఐదు వేలమంది ఉంటున్నారని.. వైకాపా పాలనలో తాగునీరు, విద్యుత్తు సరఫరా నిలిపేసినందున ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ముప్పాళ్ల విద్యార్థి

ఈపూరు, న్యూస్‌టుడే : మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థి గన్నేపల్లి చినబాబు బాస్కెట్ బాల్‌లో సౌత్‌జోన్ అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ చుండు వెంకటరావు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జరిగిన విశ్వ విద్యాలయం జట్టు ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి జట్టులో స్థానం సాధించినట్లు ఆయన చెప్పారు.



చినబాబు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే

? పట్టణంలోని ఏంజిల్ టాకీస్ వద్ద ఉన్న 18వ వార్డు సచివాలయం ఎదుట అల్పాహార బండ్లు ఏర్పాటు చేశారు. వార్డు సచివాలయంలోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఆక్రమణలు తొలగించాలి. **- శ్రీనివాసరావు**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఆక్రమణలు తొలగిస్తాం. **-సాంబయ్య, టీపీవో**

? ఇస్లాంపేట మొహిద్దీన్ నగర్‌లో మురుగు కాలువలు శుభ్రం చేయటం లేదు. మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. **- సయ్యద్ రెహమాన్**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగు సక్రమంగా పారేలా చర్యలు తీసుకుంటాం. **- జస్వంతరావు, మున్సిపల్ కమిషనర్**

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే

? సాయినగర్‌లో వీధి దీపాలు వెలగక రాత్రిపూట చీకట్లో ఇబ్బంది పడుతున్నాం. **- పీఎల్ నారాయణ**

✔ వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.**- జస్వంతరావు, కమిషనర్, నరసరావుపేట పురపాలక సంఘం**

? సాయినగర్‌లో రాత్రిపూట మందు బాబులు చీకట్లో మద్యం తాగి ప్రజలను భయపెడుతున్నారు. **- నారాయణ**

✔ పోలీసు సిబ్బందితో పహారా ఏర్పాటు చేయించి పర్యవేక్షిస్తాం. **-హైమారావు, సీఐ, 2వ పట్టణ వలయం**

?: సాయినగర్‌లోని ఇసప్పాలెం డొంక రోడ్డు నుంచి సాయిబాబా ఆలయానికి వచ్చే మార్గంలో మురుగు కాలువలు లేవు.

✔ నిధుల లభ్యత మేరకు అంచనాలు రూపొందించి, మురుగు కాలువల నిర్మాణానికి చర్య తీసుకుంటాం. **- జస్వంతరావు, కమిషనర్, నరసరావుపేట పురపాలక సంఘం**

నూజండ్ల, న్యూస్‌టుడే

? వినుకొండ- దర్శి ఆర్‌అండ్‌బీ రోడ్డులో రాముడుపాలెం వద్ద చిలకలేరుపై ఉన్న చప్టా పూర్తిగా ధ్వంసమైంది. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి.**- సీతారామయ్య, రాముడుపాలెం**

✔ కొత్త చప్టా నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేయిస్తాం.**- నవ్య, ఆర్‌అండ్‌బీ ఏఈ**

న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

? వేలూరులో పలు రహదారుల్లో మురుగు కాల్వల్లో నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నాం. **-గోపి, వేలూరు**

✔వెంటనే పరిశీలించి కాల్వలు శుభ్రం చేయిస్తాం. **-క్రాంతి, పంచాయతీ కార్యదర్శి**

? స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట సాయిబాబా గుడి వెనకాల ముళ్లచెట్లు దట్టంగా పెరిగాయి. మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. **-బంగారుబాబు**

✔ పరిశీలించి పొక్లెయిన్‌తో కంపచెట్లు తొలగిస్తాం. మురుగు లేకుండా చర్యలు తీసుకుంటాం. **-రమణారావు, పారిశుద్ధ్య అధికారి**

పేదింట క్రీడా కుసుమాలు

✤ సాఫ్ట్‌బాల్‌లో రొంపిచర్ల క్రీడాకారుల సత్తా

రొంపిచర్ల, నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే

కఠోర సాధన, పట్టుదల, కృషి ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని నిరూపిస్తున్నారు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదు అని రుజువు చేస్తూ రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాల, ఊరు, గురువులకు మంచి పేరు తెస్తున్నారు. వారే రొంపిచర్ల సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్‌లో అండర్‌- 14 విభాగాల్లో సత్తా చాటి వచ్చే నెల 16 నుంచి 18 వరకు చిత్తూరు జిల్లా అగరాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. తమ లక్ష్యాలను ఈ సందర్భంగా పంచుకున్నారు.



సాఫ్ట్‌బాల్ ఆటలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న పీడీ సైదయ్య

పోలీసు కావాలి

పేరు : వెంగళరాజు శ్రీదేవి
తరగతి : 7వ తరగతి
తల్లిదండ్రుల వృత్తి : వ్యవసాయ కూలీలు.
లక్ష్యం : చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపి క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం.



వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగం సాధిస్తా

పేరు : కే.వరప్రసాద్
తరగతి : 8వతరగతి
తల్లిదండ్రుల వృత్తి : వ్యవసాయ కూలీలు
లక్ష్యం : చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటి మంచి ఉద్యోగం పొందాలి. అందుకు పాఠశాల స్థాయి నుంచే క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నా. జీవితంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా సేవలు అందించటమే నా లక్ష్యం.



ఎస్సై కావాలని..

పేరు : జి.రుషివర్ధన్
తరగతి : 7వ తరగతి
తల్లిదండ్రుల వృత్తి : తాపీ మేస్త్రీ
లక్ష్యం : జిల్లాస్థాయి పోటీలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించటం చాలా గర్వంగా ఉంది. జీవితంలో క్రీడా కోటా కింద ఎస్సై ఉద్యోగం సాధించాలన్నది లక్ష్యం.



జాతీయ జట్టుకు ప్రాతినిధ్యమే లక్ష్యం

పేరు : షేక్ షైలు, **తరగతి :** 8వ తరగతి
తండ్రి : ఆర్టీసీలో ఒప్పంద డ్రైవర్
లక్ష్యం : ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్‌- 14 విభాగంలో సాఫ్ట్‌బాల్, ఖో-ఖో పోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాను. రానున్న కాలంలో సాఫ్ట్‌బాల్ విభాగంలో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్నదే నా లక్ష్యం.



ఉన్నత చదువులకు దోహదం

పేరు : జి.సాయి చైతన్య, **ఊరు :** రొంపిచర్ల
తరగతి : 8వతరగతి
తల్లిదండ్రుల వృత్తి : వ్యవసాయ కూలీలు
లక్ష్యం: నేను సాఫ్ట్‌బాల్ క్రీడలో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. క్రీడా కోటాతో ఉన్నత చదువులు చదువుకోవటానికి ఈ ఆటను ఎంపిక చేసుకున్నాను. భవిష్యత్తులో క్రీడ కోటా ద్వారా డాక్టర్ కావాలన్నది నా లక్ష్యం.



పట్టభద్రులు ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

వినుకొండ, న్యూస్‌టుడే : కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో వచ్చేనెల 6లోపు పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ సహాయ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి సురేష్‌నాయక్ ఓ ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు ఫారం-18 దరఖాస్తులు 230 అందినట్లు తెలిపారు. దరఖాస్తులు తమ కార్యాలయంలో పొందవచ్చని ఆయన సూచించారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : 2025- 26 ఏడాదికి పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పీహెచ్ ఖాన్ ఆధ్వర్యంలో నరసరావుపేటలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్కిల్ అధ్యక్షుడిగా షేక్ మస్తానవలి, కార్యదర్శిగా పూనూరి ఆనందరావు, సంయుక్త కార్యదర్శిగా కె.రాంబాబు, కోశాధికారిగా జి.శివకోటిరెడ్డి, మహిళ సంయుక్త కార్యదర్శిగా కె.అజిత, డివిజన్ సభ్యులుగా షేక్ రఫీ, గాంధీబాబు, ఆర్.అరవిందను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ కంపెనీ ప్రధాన కార్యదర్శి ఎ.గురునాథరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : జిల్లాస్థాయి అండర్- 14, అండర్- 17 బాల, బాలికల సైక్లింగ్ పోటీలను చిలకలూరిపేట బైపాస్‌లో గురువారం జిల్లా కార్యదర్శి ఎం.సురేష్‌కుమార్ ప్రారంభించారు. చిలకలూరిపేట శారదా జడ్పీహెచ్‌ఎస్ నుంచి ఎ.లక్ష్మీదేవశ్రీ, ఎం.వైష్ణవి, ఎ.సమాధాన కుమారి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం రత్నజ్యోతి తెలిపారు. విజేతలను పీఈటీలు పొదిలి వెంకటేశ్వర్లు, సువర్ణరాజు అభినందించారు.

వైద్యసేవలు సద్వినియోగం

యడ్లపాడు, న్యూస్‌టుడే : మండలంలోని సొలస చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గుంటూరు శ్రేష్ఠ ఆసుపత్రి, మాక్సీవిజన్ ఆసుపత్రి వైద్యులు బాధితులకు గుండె, కంటి పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ విజిలెన్స్ అధికారి ఈదర రాంబాబు, జిల్లా ప్రాంతీయ మేనేజర్ వర్ల శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ రాంబ్రహ్మం, బ్రాంచి మేనేజర్ కె.ప్రణీత్, కో- ఆర్డినేటర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించేందుకు ముహూర్తం లేదా?

పిచికలపాలెం (శావల్యాపురం), న్యూస్‌టుడే: గ్రామస్థులకు తాగునీటిని అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రం గత కొంతకాలంగా నిరుపయోగంగా మూలన చేరింది. దీంతో చాలాకాలం ప్రజలు చెరువుల నుంచి వచ్చే కలుషిత నీటిని తాగుతున్నారు. 2017లో మండలంలోని పిచికలపాలెం శివారు శ్రీరాంపురంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో 20 లీటర్ల శుద్ధ జలాన్ని ప్రజలకు రూ.2కే అందించే ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ పంచాయతీలు, గ్రామీణ నీటి సరఫరా అధికారులకు అప్పగించారు. అయితే పథకం పూర్తయినా వినియోగంలోకి తేలేదు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.




నిరుపయోగంగా ఆర్వోప్లాంటు

ఆరోగ్య శాఖ నిర్లక్ష్యమా.. వైకాపాపై అభిమానమా?

నూజండ్ల, న్యూస్‌టుడే : ప్రభుత్వాలు మారి నాలుగు నెలలు గడిచినా వైకాపా ప్రభుత్వంలో ఉన్న పథకాలు, భవనాలపై ఉన్న పేర్లు మార్చడానికి ఆరోగ్య శాఖకు సమయం సరిపోలేదు. త్రిపురాపురంలో వైఎస్సార్ విలేజ్ క్లీనిక్‌పై పేర్లు, భవనం వద్ద వైఎస్సార్ ఆరోగ్య శ్రీ బోర్డు అలాగే ఉంది.



త్రిపురాపురంలో పేర్లు మార్చని వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ భవనం



క్లీనిక్ వద్ద జగన్ బొమ్మతో ఉన్న వైఎస్సార్ ఆరోగ్య శ్రీ బోర్డు

వ్యాసరచనతో భావవ్యక్తీకరణ

‘ఈనాడు’ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు



విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయిని పార్వతి



విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ ఎన్.సంధ్య, డీన్ కె.వీరాంజనేయులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ‘ఈనాడు’ ఆధ్వర్యంలో నరసరావుపేట మండలం జడ్పీ ఉన్నత పాఠశాల, శంకరభారతీపురంలో విద్యార్థులకు బుధవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. పోటీల్లో భాగంగా ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో సీహెచ్ హేమశ్రీ, కె.అఖిల, కె.భాను వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయిని పార్వతి బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయుడు లక్ష్మయ్య పర్యవేక్షించారు.

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : ‘ఈనాడు’ ఆధ్వర్యంలో చిలకలూరిపేట పట్టణం శ్రీచైతన్య పాఠశాలలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్‌నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన ఎస్.శ్రీనిధి, పి.హరిని, డి.హేమదుర్గలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రిన్సిపల్ ఎన్.సంధ్య, డీన్ కె.వీరాంజనేయులు అందజేశారు.

నగదు రహిత చెల్లింపులు తప్పనిసరి

శావల్యాపురం, న్యూస్‌టుడే : స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణాల చెల్లింపులు నగదు రహిత లావాదేవీలుగా ఉండాలని జిల్లా స్త్రీనిధి మేనేజరు రంతు చిన బుల్లెయ్య తెలిపారు. గురువారం శావల్యాపురం వెలుగు కార్యాలయంలో స్త్రీనిధి రుణాల రికవరీపై సీసీలు, యానిమేటర్లతో సమావేశం నిర్వహించారు. వినుకొండ నియోజకవర్గంలో శావల్యాపురంలో రూ.27 లక్షలు, వినుకొండ మండలంలో రూ.39 లక్షలు బకాయిలు ఉన్నాయని, స్త్రీ నిధి ద్వారా సభ్యులకు రుణాలు ఇవ్వాలంటే మండలం మొత్తం మీద రూ.20 లక్షలు మాత్రమే బకాయి ఉండాలని పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లా మొత్తం మీద రూ.120 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు రూ.19.5 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా పేటీఎం యంత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఏపీఎం జి.వాసుబాబు, సీసీలు ఖాజావలి, మేరీ, కరుణ తదితరులు ఉన్నారు.



పేటీఎం యంత్రం అందజేస్తున్న స్త్రీనిధి జిల్లా మేనేజరు చిన బుల్లెయ్య

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో అనారోగ్యానికి గురైన పలువురికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

అమ్మవారి సొత్తూ వదల్లేదు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : మండలంలోని లక్ష్మీపురం గాయత్రీ మాతా ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. ప్రధాన ద్వారం గ్రిల్స్ తాళాలు పగులగొట్టి హుండీని పెకిలించి సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లి పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.



పొలాల్లో పడేసిన హుండీ

ఇంటర్‌లో నూరు శాతం ఫలితాలు సాధించాలి

యడ్లపాడు, న్యూస్‌టుడే : ఇంటర్ తుది పరీక్షల్లో నూరు ఫలితాల సాధనకు అధ్యాపకులు, విద్యార్థినులు కృషి చేయాలని జిల్లా వొకేషనల్ విద్యాశాఖాధికారి (డీవీఈవో) ఎ.నీలావలి అన్నారు. యడ్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ తరగతి గదులకు వెళ్లి బోధన తీరు పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఉచిత అచ్చు, రాత పుస్తకాలు, బ్యాగులు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. గణపవరంలోని సీఆర్ కళాశాల లేదా చిలకలూరిపేటలోని ఏఎంజీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ప్రయోగాలు చేసుకోవటానికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. స్వంత ఖర్చులతో విద్యార్థినులకు సమ దుస్తులు అందించిన పీజీటీ ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయభారతి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి పలువురి విరాళం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసి వెళ్లి గురువారం విరాళం అందజేశారు. అవధాన నాగేశ్వరరావు రూ.లక్ష, వి.సాంబశివరావు రూ.40,200, ఏవీ నాగేశ్వరరావు రూ.40 వేలు చెక్కు అందజేశారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : తెదేపా సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు తర్వాత సంస్థాగత ఎన్నికలు ఉంటాయని తెలిపారు. ప్రతి క్రియాశీల కార్యకర్తకు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. వార్డులు, గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ రాష్ట్ర నేతలు నల్లపాటి రామచంద్రప్రసాద్, వేల్పుల సింహాద్రి, వేములపల్లి నర్సయ్య, వాసిరెడ్డి రవీంద్ర, కొట్టా కిరణ్, కుమ్మెత కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన నూజండ్ల రోడ్డులోని చాట్రగడ్డపాడు సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. వినుకొండ ఎల్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ మొగిలి వెంకట కోటేశ్వరరావు కార్యాలయ పనుల నిమిత్తం చాట్రగడ్డపాడు, నూజండ్ల వెళ్లి తిరిగి వినుకొండ వస్తున్నారు. అదే సమయంలో వినుకొండ నుంచి నూజండ్ల వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి రెండు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకట కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108లో వినుకొండ వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కొరకు నరసరావుపేటకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ బాజి తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్టు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గంజాయి తరలిస్తున్న పాత నేరగాళ్ల ముఠాను పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వారి నుంచి రెండు కేజీల గంజాయితో పాటు పదమూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన గురువారం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పరిధిలోని జాతీయ రహదారి వద్ద చోటు చేసుకుంది. చిలకలూరిపేటకు చెందిన కుంభా గోపి, ఉయ్యాల రవి, బాపట్ల జిల్లా జె.పంగులూరుకు చెందిన వాసుబాబు, గుంటూరు జిల్లా తెనాలికి చెందిన చుక్కా నాగ గోపీచంద్, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మోటుమాలకు చెందిన కోడూరి సుబ్బారెడ్డి గతంలో పలు కేసుల్లో శిక్ష అనుభవించారు. ఇటీవల ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి జిల్లాకు తరలించి యువతకు విక్రయిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం గోపి, రవి ఒడిశా నుంచి రెండు కేజీల గంజాయి కొనుగోలు చేశారు. వారు గురువారం సింగరాయకొండ పరిధిలోని పోలేరమ్మ గుడి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వారాంతపు సెలవులివ్వాలని ఆందోళన

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : మున్సిపల్ కార్యాలయ కార్మికులకు సెమీ స్కిల్, అన్‌స్కిల్డ్ వేతనాలు, వారాంతపు, పండగ సెలవులు ఇవ్వకపోవడం అన్యాయమని, వాటిని అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం మున్సిపల్ కార్మికులు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు అల్లాభక్షు, కార్యదర్శి సోమశేఖర్, శ్రీను, సామ్రాజ్యం, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువపత్రం ఇవ్వకుండా ఇబ్బందులు

బొందిలిపాలెం (శావల్యాపురం), న్యూస్‌టుడే : అన్ని ఆధారాలతో కుల ధ్రువపత్రం కావాలని దరఖాస్తు చేసి నెల గడుస్తున్నా పత్రం ఇవ్వలేదని తెదేపా రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి, బొందిలిపాలెం మాజీ సర్పంచి బత్తుల వెంకటేశ్వర్లు వాపోయాడు. తనకు కృష్ణ బలిజకు సంబంధించిన కుల ధ్రువపత్రం మంజూరు చేయాలని కోరుతూ సెప్టెంబరు 10న మతుకుమల్లి సచివాలయంలో దరఖాస్తు చేశానని, ఆధారాలు అందించినట్లు చెప్పారు. ఆర్ఐ విచారణ అనంతరం తహసీల్దారు తిరస్కరించినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలియో అవగాహన ర్యాలీ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక పండరీపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా గురువారం సాదినేని చౌదరయ్య, మోడరన్ పాఠశాల విద్యార్థులు పట్టణంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి పోలియోపై అవగాహన కల్పించారు. లంక రఘురామిరెడ్డి సహకారంతో మూడు చక్రాల సైకిల్ బహూకరించారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంటు లక్ష్మీకుమారి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

యడ్లపాడు : మండలంలోని కారుచోలలో జూదరులు గురువారం పోలీసులకు పట్టుబడ్డారు. స్థానిక బొడ్డురాయి వద్ద షెడ్డులో జూదమాడుతున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేసి రూ.32,590 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

ఏడేళ్ల తర్వాత వ్యక్తి ఆచూకీ గుర్తింపు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట) : నరసరావుపేట రామిరెడ్డిపేటకు చెందిన జోసెఫ్ దేవదానం ఏడేళ్ల క్రిందట భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఏడేళ్ల అనంతరం ఒకటో పట్టణ పోలీసులు అచూకీ కనుగొని మంగళవారం అతని తల్లి మరియమ్మకు అప్పగించినట్లు ఒకటో పట్టణ సీఐ విజయ్ చరణ్ పేర్కొన్నారు.

ఏఎన్‌యూ కబడ్డీ విజేత కృష్ణవేణి కళాశాల

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ఏఎన్‌యూ అంతర కళాశాలల కబడ్డీ పురుషుల ఛాంపియన్ షిప్ పోటీల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. 21 నుంచి 23 వరకు గుంటూరులోని విజ్ఞాన్ కళాశాలలో పోటీలు నిర్వహించారన్నారు. కళాశాలకు చెందిన నాగ ఫణీంద్ర, అజయ్‌కుమార్, విజయ్‌కుమార్, అంకాలు విశ్వ విద్యాలయ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. తమిళనాడులోని ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయంలో నిర్వహించే దక్షిణ భారత అంతర విశ్వ విద్యాలయాల పోటీల్లో ఏఎన్‌యూ జట్టు తరపున పాల్గొంటారని వివరించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్యా, పీడీ ఈదర ఆదిబాబు క్రీడాకారులను అభినందించారు.



విజేతలతో కళాశాల ప్రిన్సిపల్ తదితరులు

ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. టెక్ మహేంద్ర సంస్థ ప్రతినిధులు కళాశాలలో ఎంపికలు నిర్వహించినట్లు చెప్పారు. బృంద చర్చ, జామ్, హెచ్‌ఆర్ రౌండ్లు నిర్వహించి 21 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కళాశాలలో వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు డైరెక్టర్లు కాట్లా రామకోటేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, సూదా సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్లు

గేమింగ్ ఆడుతున్న ఐదుగురి అరెస్టు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: గేమింగ్ ఆట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాల మేరకు.. ఉప్పరపాలెంలోని డంపింగ్ యార్డ్ వద్ద గేమింగ్ ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో పట్టణ సీఐ శోభన్‌బాబు ఆదేశాల మేరకు గురువారం ఎస్సై సమీర్‌భాషా సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.17,140 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రతి నెలా అద్దె చెల్లించాల్సిందే

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్‌కు సంబంధించిన స్థలాల్లో ఉంటున్న వారందరూ ప్రతి నెలా అద్దె చెల్లించాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కృష్ణ తెలిపారు. గురజాలలో జడ్పీ స్థలాలను అద్దెకు తీసుకున్న వ్యాపారులతో గురువారం సమావేశం నిర్వహించారు. సుమారు రూ.15 లక్షలు బకాయి ఉండటంతో కొంతకాలం వేచి చూశారు. మిగతా బకాయి వెంటనే చెల్లించాలని ఆదేశించారు. ఎంపీడీవో షేక్ గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

పీసపాటికి పురస్కారం

అమరావతి, న్యూస్‌టుడే: అమరావతికి చెందిన ఆధ్యాత్మికవేత్త, ప్రముఖ ఉపన్యాసకులు పీసపాటి నాగేశ్వరశర్మకు ఉమ్మడి సింగ కృష్ణారావు జయంతి సందర్భంగా ఆంధ్ర జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన మాసావ ఆర్ట్స్ థియేటర్ నిర్వాహకులు అందించారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

బాలికల చదువు.. సమాజానికి వెలుగు

సత్తెనపల్లి: బాలికల చదువు.. సమాజానికి వెలుగునిస్తుందని సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. రఘురామ్‌నగర్‌లోని బీసీ బాలికల వసతి గృహాన్ని గురువారం జడ్జి సందర్శించారు. ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించారు. పరిసరాల శుభ్రత.. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని వసతి గృహ బాధ్యురాలికి సూచించారు. ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌఫిద్ హుస్సేన్, ప్యానల్ న్యాయవాది లక్ష్మీకోటేశ్వరరావు పాల్గొన్నారు.


ఆహారం రుచి చూస్తున్న సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? వైకుంఠపురం ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు పూడికతో నిండిపోయాయి. మురుగు నిల్వతో దుర్వాసన, దోమల బెడద పెరిగింది. **- కాలనీవాసులు**

✔ సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయిస్తాం. **- సుధాకర్, కార్యదర్శి**

- న్యూస్‌టుడే, అమరావతి

? భట్లూరు ఎస్సీకాలనీలో చర్చి సమీపంలోని వీధులకు రెండు వైపులా మురుగు కాలువల్లో పూడిక తీయడంలేదు. **- కాలనీ వాసి**

✔ పూడిక తీయాల్సిన వీధులను గుర్తించి అధికారులకు నివేదించి తగిన చర్యలు చేపడతాం. **- శ్రీనివాసరావు, కార్యదర్శి**

? ప్రధాన రహదారి సమీపంలోని కాలనీ వీధుల్లో మురుగు నీరు నిల్వ ఉండి పాచి పేరుకుపోతోంది. దోమల ఆవాసంగా మారింది. **- షేక్ బాజి, పాకాలపాడు**

✔ పంచాయతీలో నిధుల ఆధారంగా పాగింగ్ చేపడతాం. మురుగు పారుదలకు చర్యలు తీసుకుంటాం. **- ఖాదర్‌బాషా, కార్యదర్శి - న్యూస్‌టుడే, సత్తెనపల్లి గ్రామీణ**

? గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. దోమలు ప్రబలి రోగాల బారిన పడుతున్నాం. **- రమేష్, గ్రామస్థుడు, పాటిబండ్ల**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. కాలువల్లో పూడికతీత చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. **- రామకృష్ణ, ఎంపీడీఓ**

- న్యూస్‌టుడే, పెదకూరపాడు

? హోటళ్లు, మాంసం దుకాణదారులు వ్యర్థాలను ప్రధాన రహదారులకు ఇరువైపులా వేస్తున్నారు. దుర్వాసన భరించలేకున్నాం. **- కరిముల్లా, రెడ్డిగూడెం**

✔ కార్మికుల ద్వారా వ్యర్థాలను తొలగిస్తాం. దుకాణదారులకు అవగాహన కల్పించి సమస్య లేకుండా చేస్తాం. **- ముక్కంటి, ఈవోపీఆర్డీ - న్యూస్‌టుడే, రాజుపాలెం**

వాలీబాల్ పోటీల్లో సత్తా

కారంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 17 ఏళ్లలోపు వాలీబాల్ పోటీలలో పెదకొదమగుండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థి శ్యాంప్రకాష్ సత్తా చాటాడు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

ఇంకుడు గుంతలతో మేలు

అచ్చంపేట: మండలంలో ఉపాధి పథకం ద్వారా ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఏపీవో నాగశ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.6 వేలు అందజేస్తుందన్నారు.

డీఎస్పీకి సత్కారం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఇటీవలే సత్తెనపల్లి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎం.హనుమంతరావును ఆయన కార్యాలయంలో గురువారం అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఆధ్వర్యంలో సత్కరించారు.

రీసర్వే తప్పులు.. రైతన్నకు తిప్పలు

గ్రామసభల్లో అర్జీలు వెల్లువ ● పొరపాట్లు దిద్దేందుకు అవకాశం

ముప్పాళ్ల, గురజాల, న్యూస్‌టుడే

వైఎస్‌ఆర్ జగనన్న భూరక్ష.. శాశ్వత భూహక్కు పేరుతో గత ప్రభుత్వం చేసిన రీసర్వేలో ఎన్నో తప్పులు చోటుచేసుకున్నాయి. రైతుల అనుమతుల్లేకుండా సర్వే చేపట్టి కొత్త సమస్యలు సృష్టించారు. అడంగల్‌లో ఉన్న విస్తీర్ణం కంటే చాలామందికి తక్కువగా.. కొందరికి ఎక్కువగా నమోదు చేశారు. కొన్ని భూముల వివరాలే కనిపించడం లేదు. ఏకీకృత ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్) ప్రక్రియ పకడ్బందీగా చేపట్టలేదు. రీసర్వేలో తప్పులు సరిదిద్దేందుకు ఈనెల 18 నుంచి నిర్వహిస్తున్న గ్రామసభల్లో అధికసంఖ్యలో అర్జీలు దాఖలవుతున్నాయి.


బొల్లవరంలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డివిజనల్ సర్వేయర్ విజయ్‌కుమార్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ లక్ష్మీప్రసాద్

● జిల్లాలో 156 రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే జరిగింది. 4,20,401 ఎకరాలు సర్వే చేసినట్లు లెక్కలు చూపారు. ఇందులో భూ సరిహద్దు, విస్తీర్ణం, మ్యూటేషన్, డివిజన్ పేర్లు, సర్వే నంబర్లు, రైతుల పేర్లు తదితరాలు తప్పులు దొర్లాయి.

● వాలిడేషన్ ప్రక్రియ అనంతరం 9(2) నోటీసులను సక్రమంగా జారీ చేయలేదు.


● వెబ్‌ల్యాండ్‌లో నమోదైన వివరాలు తప్పుల తడకగా ఉండటంతో వేలాదిమంది రైతులు రీసర్వే తరువాత ఇబ్బంది పడుతున్నారు. పూర్వార్జితాల హక్కుల విషయంలో చిక్కులు తలెత్తాయి. ● డ్రోన్ ద్వారా సర్వే చేసిన తర్వాత సర్వే నంబర్లు, సబ్ డివిజన్ వారీగా కాకుండా ఏకీకృత ఎల్‌పీఎంగా వివరాలు నమోదు చేశారు. దీంతో ఒక సర్వే నంబరులోని రైతులందరికీ ఒకే ఎల్‌పీఎం కేటాయించారు. ఎవరికివారు 1బీ, అడంగల్ కాపీలు తీసుకునే అవకాశం లేకుండా చేశారు. రీసర్వే తప్పిదాలతో సచివాలయాల్లో ఆ కాపీలు రావట్లేదు.

● భూముల క్రయవిక్రయాలకూ సాంకేతిక సమస్యలు ప్రతిబంధకంగా మారుతున్నాయి.

పొలం విస్తీర్ణం తగ్గింది

బొల్లవరం గ్రామ సర్వే నంబరు 99లో నా పేరుతో 1.25 ఎకరాలు ఉంది. దశాబ్దన్నరకాలంగా ఆ భూమి సాగు చేసుకుంటున్నాం. పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్‌డీడ్‌తో పాటు అన్నిరకాల ధ్రువపత్రాలు ఉన్నాయి. రీసర్వేలో 1.15 ఎకరాలే ఉన్నట్లు రెవెన్యూ సిబ్బంది చెప్పారు. ఏకంగా 10 సెంట్లు తగ్గించారు. అదేంటని ప్రశ్నిస్తే మీ పొలంలో కాలువ ఉందని, అది కలిసిపోయిందని చెప్పారు. నా పొలంలో కాలవ లేదు. దీనిపై గ్రామసభలో అర్జీ ఇచ్చాను. **- వెంకాయమ్మ, బొల్లవరం**

1.72 ఎకరాలే నమోదు చేశారు



రీసర్వే తర్వాత నా పొలం వివరాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో ఎక్కలేదు. 1.86 ఎకరాలకు గాను, 1.72 ఎకరాలు మాత్రమే నమోదు చేశారు. ఈ విషయం గత ప్రభుత్వంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ప్రస్తుతం పులిపాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చా. తహసీల్దార్ స్పందించి సర్వేయర్‌తో కొలతలు వేయించి, ఆన్‌లైన్‌లో ఎక్కించే అంశాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. **- సత్యన్నారాయణ, పులిపాడు, గురజాల మండలం**

రోడ్డు మూసేశారని ఫిర్యాదు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని పదో వార్డు వాసవినగర్ ఆర్చి రోడ్డును మూసివేయడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని ప్రభుత్వ ఉపాధ్యాయుడు షేక్ మహబూబ్ సుభాని పురపాలక సంఘ కమిషనర్, తహసీల్దార్, పట్టణ సీఐలకు గురువారం లిఖితపూర్వక ఫిర్యాదులు అందజేశారు. దశాబ్దాలుగా ఉన్న రోడ్డును ఓ రేకులతో మూసివేసి ఉన్నపళంగా హెచ్చరిక బోర్డు పెట్టారని ఆయన తెలిపారు. ఈ మార్గంలోనే బీసీ వసతి గృహం విద్యార్థులు రాకపోకలు సాగిస్తారని, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద 70 మీటర్ల రోడ్డును కూడా ఇటీవలే మున్సిపాల్టీ నిర్మించిందన్నారు. రోడ్డు ఆశ్రమ స్థలం కావడంతో ఆక్రమణకు గురవ్వకుండా హెచ్చరిక బోర్డు పెట్టామని, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించలేదని శ్రీసనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ పీఠాధిపతి లలితాంబ మాతాజీ తెలిపారు.

కమిషనరు పరిశీలన

గురజాల, న్యూస్‌టుడే: గురజాల 23 వార్డు పరిధిలోని ఎస్టీ కాలనీలో నగర పంచాయతీ కమిషనరు వి.శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. గేదెలను కట్టుకోవడానికి ప్రత్యేక ప్రదేశాలు చూసుకోవాలని, వీధుల్లో ఉంచొద్దని సూచించారు. డ్రైనేజీ సమస్య ఉందని ప్రజలు కమిషనరు దృష్టికి తీసుకురావడంతో పరిష్కరిస్తామని చెప్పారు.





పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, విజేతలకు బహుమతులు అందజేసిన ఛైర్మన్, ప్రిన్సిపల్


వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి సమీపంలోని గీతికా పాఠశాలలో గురువారం ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో 8,9,10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాల వినియోగం లాభానష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కె.రాజశేఖర్ (తొమ్మిదో తరగతి), ఎన్.వి.ఎస్.ఎల్.కారుణ్య (ఎనిమిదో తరగతి), జె.సాయి చరణ్‌తేజ (పదో తరగతి) ప్రతిభ చాటి తొలి మూడుస్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ఛైర్మన్ టి.బాలగంగాధరరెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

క్రోసూరు కష్టాలు తీరేదెన్నడో?

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరు ప్రజల కష్టాలు తీరక సతమతమవుతున్నారు. దశాబ్దాలుగా తమ కష్టాలు తీర్చేవారే లేరని ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా ఆర్‌అండ్‌బీ రహదారికి పడమర వైపు చెరువు కట్ట వరకు 1500 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ ప్రాంతం 2015 నుంచి 22ఏ నిషేధిత జాబితాలో నమోదైంది. దీంతో అక్కడ ఇళ్లు, స్థలాలు అమ్మాలన్నా.. కొనుగోలు చేయాలన్నా అక్కడి నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడు. చెరువు ఆనుకుని 22 ఎకరాల్లో దశాబ్దాల నుంచి ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని బాధితులు చెబుతున్నారు.

ట్రాఫిక్ సమస్య: క్రోసూరు ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. రహదారిలో ఇరువైపులా మార్జిన్లు ఆక్రమించి తోపుడు బండ్లు, దుకాణాలు ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రీచ్‌ల నుంచి ఇసుక వాహనాలు ఈ మార్గంలోనే ప్రయాణిస్తున్నాయి. విద్యుత్తు ఉపకేంద్రం నుంచి అందుకూరు రోడ్డుమీదుగా పశువైద్యశాల వెనుక వరకు బైపాస్ నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుంది.


క్రోసూరు గ్రామ చెరువు ప్రాంతం

ప్రజా మరుగుదొడ్ల ఊసేది: క్రోసూరు ఆర్‌అండ్‌బీ బంగళా ప్రాంతంలో ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలని మండల ప్రజలు ఎప్పట్నుంచో కోరుతున్నారు. మండల ప్రజలు నిత్యం ఆయా పనుల నిమిత్తం వస్తున్నారు. వారికి ప్రజా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టికి గ్రామస్థులు సమస్యను తీసుకెళ్లారు.

మురుగు పారేదెలా?



పట్టణంలోని ఒకటి, రెండు, మూడు వార్డుల్లో గతంలో నిర్మించిన మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. మురుగు ముందుకు పారక వందలాది కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. కాల్వల్లో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి**



గురజాల మండలం చర్లగుడిపాడులోని అంకాలమ్మ దేవస్థానం పక్కన మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయింది. నీరు కదలక దుర్వాసన, దోమలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పూడిక తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ**

వంతెన సరే.. రోడ్డు నిర్మించరే..



ధూళిపాళ్ల-భృగుబండ మార్గంలో ఎద్దువాగుపై రూ.2 కోట్ల అంచనాతో హైలెవెల్ వంతెన నిర్మించి సుమారు ఏడాదిన్నర గడిచింది. వంతెనకు అనుసంధానంగా ఇరువైపులా తారు రోడ్డు ఏర్పాటు చేయలేదు. నిత్యం ఇటు సత్తెనపల్లి, రాజుపాలెం, అటు క్రోసూరు మండలాలకు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. గుంతలతో ఎగుడుదిగుడుగా మారడంతో చోదకులు సాహసం చేయాల్సి వస్తోంది. రెండు వైపులా సుమారు 700 మీటర్ల తారు రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరించాలని చోదకులు, ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి గ్రామీణ**

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నకరికల్లు, న్యూస్‌టుడే: నకరికల్లులోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏవో దేవదాసు ఆధ్వర్యంలో దుకాణాల్లోని రికార్డులు పరిశీలించారు. లైసెన్స్‌లు, అమ్మకపు రశీదులు, స్టాక్ రిజిస్టర్ తదితర అంశాలపై తనిఖీలు చేపట్టారు.

యువకుడి అదృశ్యంపై కేసు

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి పట్టణానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. పట్టణానికి చెందిన రమేష్(20) ఆటో నడుపుతూ జీవనం సాగిసున్నాడు. ఈనెల 22న ఆటో ఫైనాన్స్ డబ్బులు కట్టి వస్తానని మిత్రులతో కలిసి పిడుగురాళ్ల వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో యువకుడి తండ్రి ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. మిత్రులను ఆరా తీయగా తమ వెంట రాలేదని, ఫైనాన్స్ కార్యాలయంలోనే ఉన్నట్లు తెలిపారు. దీంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మద్యం సీసాల స్వాధీనం

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడురోడ్డులో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి వద్ద 40 మద్యం సీసాలను గురువారం ఎస్సై మోహన్ పట్టుకున్నారు. గేటు వద్ద ప్రతిరోజు ఉదయం మద్యం అమ్ముతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లారు. లక్ష్మణ్ అనే వ్యక్తి వద్ద 40 మద్యం సీసాలను గుర్తించి, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ సమాచారానికి కొత్త ఫోన్ నంబరు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు సంబంధించి సేవల సమాచారానికి గతంలో అందుబాటులో ఉన్న ల్యాండ్‌లైన్ నంబరు 08641-23255 తరచూ మరమ్మతులు వస్తున్నందున కొత్తగా 7382990105 నంబరును అందుబాటులో ఉంచినట్లు డీఎం విజయ్‌కుమార్ తెలిపారు. ప్రయాణికులు చరవాణి నంబరుకు డయల్ చేసి ఆర్టీసీ సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: బ్యాంకింగ్ రంగం అమలు చేస్తోన్న వివిధ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకుంటే కుటుంబానికి, సమాజానికి బహుళ ప్రయోజనాలు లభిస్తాయని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు రవికుమార్ అన్నారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో ఆర్‌బీఐ, ల్యాంప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారుల చైతన్య, అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. లాంప్ సంస్థ పీడీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలన్నారు. పొదుపు అలవర్చుకుంటే కుటుంబానికి ఆర్థిక వెసులుబాటు కలుగుతుందన్నారు.

రహదారుల మరమ్మతులకు రూ.3.56 కోట్లతో అంచనాలు

మాచవరం, న్యూస్‌టుడే: గ్రామీణ రహదారులకు మంచి రోజులు రానున్నాయి. ఇన్నాళ్లు గుంతలతో అవస్థలు పడిన పల్లె ప్రజలకు కాస్తంత ఉపశమనం కలగనుంది. మండలంలో అధ్వానంగా మారిన పంచాయతీరాజ్ రహదారుల మరమ్మతులకు ఆ శాఖ అధికారులు ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రూ.3.56 కోట్లతో అంచనాలు రూపొందించారు. త్వరలో నిధులు మంజూరు కానున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత రహదారులకు ప్రాధాన్యత ఇస్తోంది. కొత్తపాలెం-తురకపాలెం రహదారి 2.8 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. దీని మరమ్మతులకు రూ.40 లక్షలు అవసరమని గుర్తించారు. పిల్లుట్ల-పిన్నెల్లి మధ్య 9.84 కిలోమీటర్లు ఉండగా.. అందులో సుమారు 2 కిలోమీటర్లు బాగా దెబ్బతింది. దీని బాగుకు రూ.85 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. పిల్లుట్ల-సింగరాయపాలెం తండా మధ్య 1.8 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.91 లక్షలు, మాచవరం-మోర్జంపాడు మధ్య 3 కిలోమీటర్ల దారికి రూ.85 లక్షలు, గోవిందాపురం-వేమవరం మధ్య 5.14 కిలోమీటర్లకు రూ.15 లక్షలు, చెన్నాయపాలెం-రేగులగడ్డ మధ్య 1.5 కిలోమీటర్ల రహదారి బాగు కోసం రూ.40 లక్షలతో ప్రతిపాదించారు.

పల్స్ పోలియోపై అవగాహన


ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు, రోటరీ క్లబ్ సభ్యులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా గురువారం కె.ఎన్.ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు, రోటరీక్లబ్ సభ్యులు అవగాహన కార్యక్రమం, ప్రదర్శన నిర్వహించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు గర్రె సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ, రోటరీక్లబ్ పోలియో నిర్మూలనకు కృషి చేశాయన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించటానికి ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు, కార్యదర్శి నీరుమళ్ల రాజేష్, ఆత్మకూరి గురవయ్య, కాకుమాను శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్లు కె.నరసింహారావు, బి.మస్తాన్‌రావు పాల్గొన్నారు.

క్రోసూరు(అచ్చంపేట): పోలియో మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.శ్యాంసన్ అన్నారు. గురువారం ఆయన క్రోసూరు మండలం అనంతవరం ఆరోగ్య ఉపకేంద్రంలో పోలియో నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. ఆరోగ్య కార్యకర్త పద్మావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టభద్ర ఓటర్ల నమోదులో స్ఫూర్తి చాటాలి


ఫారం-18ను నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాస్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదై స్ఫూర్తిగా నిలవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టభద్ర ఓటరుగా నమోదు కోసం ఫారం-18ను ఆయన పూరించి గురువారం పార్టీ ఎన్నికల పరిశీలకుడు శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ త్వరలో జరిగే ఉమ్మడి గుంటూరు, కృష్ణా పట్టభద్రుల ఎన్నికలో ఓటుహక్కు వినియోగించుకోవాలంటే అర్హులందరూ వెంటనే ఓటర్లుగా నమోదవ్వాలన్నారు.

ముప్పాళ్ల: పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయాలని ఇన్‌ఛార్జి తహసీల్దార్ లక్ష్మీప్రసాద్ బీఎల్‌వోలకు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పెదకూరపాడు: నియోజకవర్గంలోని పట్టభద్రులంతా ఓటు నమోదుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీ శ్రేణులు, అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుని పట్టభద్రులను గుర్తించి, ఓటు నమోదుకు దరఖాస్తు చేయించాలన్నారు.

అచ్చంపేట: ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై అచ్చంపేటలో గురువారం ముమ్మరంగా ప్రచారం చేశారు. అర్హత ఉన్న పట్టభద్రులను మండల తెదేపా నాయకులు ఆంజనేయులు కలిసి ఫారం18 అందజేశారు.

అనుమతుల్లేని భవనాలపై చర్యలు

సత్తెనపల్లి: పట్టణాల్లో ప్రణాళికా విభాగం అనుమతుల్లేకుండా ఎలాంటి భవన నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని టౌన్‌ప్లానింగ్ ఆర్డీ కార్యాలయ ఏడీ సునీత హెచ్చరించారు. పురపాలక సంఘ పరిధిలో ప్రణాళికా విభాగం అనుమతుల మేరకు నిర్మాణాలు జరుగుతున్నాయా లేదా అని గురువారం ఆమె క్షేత్ర పరిశీలన చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కూల్చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ షమ్మి, టీపీఎస్‌లు రిజ్వానా, సునీత పాల్గొన్నారు.

అల్పాదాయ కుటుంబాలకు ఆహార భద్రత

సత్తెనపల్లి, మాచర్ల, న్యూస్‌టుడే

2028 వరకు ఉచిత బియ్యం పంపిణీ



అల్పాదాయ కుటుంబాలకు ఆహార భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కరోనాతో చిన్నాభిన్నమైన నిరుపేదలకు ఆహార భద్రత సమస్య లేకుండా చేసేందుకు కేంద్రం జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) అమల్లోకి తెచ్చింది. దీనికింద 2021 నుంచి ఉచిత బియ్యాన్ని పంపిణీ చేస్తూ వస్తున్నారు. తాజాగా 2028 డిసెంబరు వరకు ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కార్డుదారులందరికీ, ఎంపిక చేసిన ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డుదారులు కొందరికి ఉచిత బియ్యాన్ని అందించనున్నారు. ఏఏవై కార్డుదారులకు 35 కిలోల చొప్పున, ఇతరులకు 5 కిలోల చొప్పున బియ్యాన్ని అందిస్తున్నారు.

జిల్లా	మొత్తం కార్డులు	యూనిట్లు
పల్నాడు	1,90,791	5,48,932
బాపట్ల	1,54,421	4,17,661
గుంటూరు	1,74,430	4,87,507

ఫోర్టిఫైడ్‌తో పోషకాలు: ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12లాంటి పోషకాలుంటాయి. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఎన్నో పోషకాలుంటాయని వాటిని ఆహారంగా తీసుకోవాలని జాతీయ పోషకాహార సంస్థ కూడా ఇటీవల ఒక నివేదికలో వెల్లడించింది. ఆహార భద్రత కార్డుదారులకు కొంతకాలంగా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కేంద్రం పంపిణీ చేస్తోంది. గత ప్రభుత్వంలో ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డుదారుల ఎంపిక సక్రమంగా జరగలేదు.

పెదకూరపాడులో ఆక్రమణల తొలగింపు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు నుంచి పాటిబండ్ల రహదారి, క్రైస్తవ శ్మశానానికి వెళ్లే రహదారుల్లో ఆక్రమణల తొలగింపునకు అధికారులు కదిలారు. ఇనుము, అట్టపెట్టెలు, ప్లాస్టిక్ తుక్కు విక్రయదారులు రహదారులు, కాల్వలు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండంతో స్థానికులు, వాహనచోదకుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. పలుమార్లు అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. వారం కిందట డయల్ యవర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాష్యం ప్రవీణ్‌కు ఫిర్యాదు రావడంతో ఆక్రమణల తొలగింపు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దారు. దానియేలు, ఈవోఆర్డీ కె.శరత్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి గురువారం తన సిబ్బందితో వెళ్లి రహదారి పక్కన నిల్వ ఉంచిన ప్లాస్టిక్, ఇనుము సామగ్రిని ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు.

మెప్మా మార్కెట్ ప్రారంభం

మాచర్ల (కారంపూడి): మెప్మా అర్బన్ మార్కెట్ ద్వారా వినియోగదారులకు తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులు దొరుకుతాయని మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు తెలిపారు. గురువారం పట్టణంలోని అన్నక్యాంటిన్ సమీపంలో మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. మెప్మా సీఈవో ఆంజలి, సీఈవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకమండలిలో చోటు హర్షణీయం

పెదకూరపాడు, న్యూస్‌టుడే: ఆలయాల పాలకమండలిలో నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం సర్వత్రా హర్షణీయమని తెదేపా బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ పేర్కొన్నారు. ఇప్పటికే ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25 వేలు, ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం ఇచ్చిన హామీతో ఆయా కుటుంబాల్లో వెలుగులు నింపుతోందన్నారు.